సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 12 । అక్టోబర్ । 2023



టీబీ డ్యాంలో తగ్గిన నీరు

తుంగభద్ర జలాశయంలో నీరు తగ్గింది. బుధవారం నీటి నిల్వ 49.398 టీఎంసీలకు పడిపోయింది.



చీనీ టన్ను రూ.23 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.23 వేలు పలికాయి. మార్కెట్‌కు 22 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
38.5°/22.3°

జిల్లా పరిధిలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. అక్కడక్కడ తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

దసరాకు ప్రత్యేక బస్సులు



డిపో మేనేజర్లతో మాట్లాడుతున్న డీపీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకూ జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల నుంచి 70 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీఓ) మధుసూదన్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్ల, ట్రాఫిక్, గ్యారేజ్ ఇన్‌చార్జ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దసరా రద్దీ నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లావాసుల కోసం ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు జిల్లా నుంచి ముఖ్య నగరాలకు సర్వీసులు తిప్పుతున్నామన్నారు. హైదరాబాద్‌కు 30, బెంగళూరుకు 20, తిరుపతికి 10, విజయవాడకు 5 సర్వీసులు తిప్పుతామన్నారు. అలాగే జిల్లాలోనూ 15 సర్వీసులు తిప్పేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అలాగే పండుగ తర్వాత తిరిగి వెళ్లే వారికోసం 24 నుంచి 27వ తేదీ వరకూ 55 సర్వీసులు నడపనున్నట్లు వెల్లడించారు. ఈ సర్వీసుల్లో ప్రయాణించే వారి నుంచి ఎలాంటి అదనపు చార్జీ వసూలు చేయడం లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. రాపుపోను టికెట్ బుక్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆరు డిపోల మేనేజర్లు, సూపర్‌వైజర్లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఓ రంగనాథ్‌కు మూడేళ్ల జైలు



పుట్టపర్తి అర్బన్: ఓ రైతు నుంచి రూ.5 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన వీఆర్‌ఓ రంగప్పగారి రంగనాథ్‌కు కర్నూలు ఏసీబీ కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే... 2017లో రంగప్ప గారి రంగనాథ్ పెనుకొండ మండలం గుట్టూరు వీఆర్‌ఓగా పనిచేసే వాడు. ఆ సమయంలో పెనుకొండ మండలం వెంకటగిరిపాలెంకు చెందిన రైతు మల్లికార్జున పట్టాదార్ పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేయగా వీఆర్‌ఓ రూ.5 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో మల్లికార్జున ఏసీబీని ఆశ్రయించి వారి సూచన మేరకు 2017 సెప్టెంబర్ 23న మల్లికార్జునకు రూ.5 వేలు లంచం ఇస్తుండగా, ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా, విచారణ జరిపిన కర్నూలు ఏసీబీ కోర్టు జడ్జి నిందితుడైన వీఆర్‌ఓ రంగప్పగారి రంగనాథ్‌కు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు.

ముద్దకు ముందే మాత్ర!

మడకశిరకు చెందిన శాంతమ్మకు 70 ఏళ్లుంటాయి. మోకాళ్ల నొప్పులు రావడంతో ఏడాది క్రితం హిందూపురంలో ఓ వైద్యున్ని సంప్రదించి మాత్రలు తెచ్చుకుంది. మాత్ర వేసుకుంటేనే నొప్పులు పోతాయన్న భావన ఆమె మనస్సులో బలంగా నాటుకుంది. దీంతో నెల రోజులు మాత్రమే వాడాల్సి ఉన్నప్పటికీ, ఏడాదిగా అవే మందులు వాడుతోంది. ఫలితంగా ఆమె ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడింది. మితిమీరిన మందుల వాడకంతో లివర్ దెబ్బతినింది. ఇప్పటికీ రోజూ ఓ ఎర్ర మాత్ర వేసుకోకపోతే నొప్పులంటూ కుటుంబీకులను ఇబ్బంది పెడుతోంది.

అజాగ్రత్త.. ఆరోగ్యానికి చేటు తెచ్చే అలవాట్లు.. డబ్బుంటే ఏ వ్యాధి అయినా నయం అవుతుందనే ధీమా.. వెరసి మనిషి జీవితాన్ని నాశనం చేస్తోంది. ఫలితంగా నిద్ర లేవగానే ముద్ద కంటే ముందు మందు బిళ్లలు తినాల్సి వస్తోంది. ఫలితంగా మందుల వ్యాపారం రోజూ రూ. కోట్లలో జరుగుతోంది.

- జిల్లా వ్యాప్తంగా పెరిగిన మాత్రల వినియోగం
- భోజనానికి ముందే మాత్రలు మింగుతున్న జనం
- బీపీ, మధుమేహం, గుండె సంబంధిత రోగులే అధికం
- రోజూ రూ. కోట్లలో సాగుతున్న మందుల వ్యాపారం

సాక్షి, పుట్టపర్తి

జీవనశైలిలో మార్పులు మనిషి జీవితాన్ని నాశనం చేస్తున్నాయి. ఆహార నియమాలు పాటించకపోవడం, చెడు అలవాట్లకు బానిస కావడంతో వ్యాధులు కబళిస్తున్నాయి. ఆరోగ్య సూత్రాలపై అవగాహన లేని కారణంగా విచ్చలవిడిగా మాత్రలు మింగేస్తున్నారు. తిండి కంటే ముందే మాత్రలు మింగేస్తున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. అధికంగా మాత్రలు మింగే వారు మరిన్ని జబ్బుల బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ఫలిగంగా మందుల వ్యాపారం.. మూడు మాత్రలు, ఆరు ఇంజక్షన్లుగా విరాజిల్లుతోందని డ్రగ్స్ నిపుణులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 650 మెడికల్‌షాపులుండగా, రోజూ రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది. మితిమీరిన మాత్రల వాడకంతో కొత్త జబ్బులు కొనితెచ్చుకోవాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



తినకముందు వాడాల్సిన మందులు..

బీపీ, షుగర్, థైరాయిడ్, పేగు సమస్యలు, శ్వాస సంబంధిత వ్యాధులు, అల్సర్, రక్త సంబంధిత వ్యాధులు, గుండె సంబంధిత వ్యాధులు, నోటి సమస్యలు, జీర్ణాశయ వ్యాధులు బారిన పడిన వారంతా పరగడుపునే మందులు వాడాల్సిన పరిస్థితి.

చాప కింద నీరులా వ్యాధులు..

మారిన ఆహార అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవనంతో జబ్బులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. బీపీ, షుగర్, శ్వాసకోశ వ్యాధులు, గుండె సంబంధిత వ్యాధులు పట్టి పీడిస్తున్నాయి. ఈ వ్యాధులున్న వారి సంఖ్య పెరగడంతో మందులు, మాత్రల వినియోగం కూడా గణనీయంగా పెరుగుతోంది. జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో రోజూ సుమారు రూ.5 కోట్లకుపైగా మందుల కోసమే ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. దీనికి తోడు ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా మందుల కొనుగోళ్ల వ్యాపారం రూ.కోట్లలో జరుగుతోంది.

కాఫీ, టీ బదులు మాత్ర!..

కొందరు పొద్దున లేవగానే టీ, కాఫీ, అల్పాహారం బదులు కొన్ని రకాల మాత్రలను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఫార్మసీ నిర్వాహకులు కూడా భోజనం తినక ముందు మింగే మాత్రలనే అధికంగా నిల్వ ఉంచుతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా ఎప్పటికప్పుడు స్టాక్ తెప్పిస్తున్నారు. ముద్ద మింగక ముందే తినే మాత్రల వ్యాపారం రోజుకు జిల్లాలో సగటున రూ.2 కోట్లు పైగా ఉన్నట్లు అంచనా.

విచ్చలవిడిగా యాంటీబయాటిక్ వాడకం

పరకడుపున యాంటీబయాటిక్ అధిక మోతాదులో మింగేస్తున్న వారి సంఖ్యా ఎక్కువగానే ఉంది. కొందరు ఆర్‌ఎంపీల వద్దకు వెళ్లి యాంటిబయాటిక్ మాత్రలు తెచ్చుకుంటున్నారు. మిగతా మాత్రలతో పాటు వాటినీ ఎడాపెడా మింగేస్తున్నారు. ఫలితంగా యాంటీబయాటిక్ మందుల అమ్మకాలు బాగా పెరిగినట్లు మెడికల్ షాపుల నిర్వాహకులు చెబుతున్నారు. కొందరు వైద్యుల సలహాలతో, మరికొంత మంది డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే షాపుకెళ్లి మందులు కొనుగోలు చేస్తూ రోగాలు కొనితెచ్చుకుంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

పీహెచ్‌సీలు	47
సీహెచ్‌సీలు	07
ఏరియా ఆస్పత్రులు	03
జిల్లా ఆస్పత్రి	01
ప్రైవేలు ఆస్పత్రులు	167
బీపీ రోగులు	18,644
షుగర్ పేషెంట్లు	13,248

జాగ్రత్తలు పాటించకపోతే ముప్పే..

ప్రస్తుతం నలుగురు కలిస్తే చాలు ఆరోగ్య సూత్రాల గురించి చర్చిస్తుంటారు. కానీ పాటిస్తున్న వారి సంఖ్య చాలా తక్కువే. చిన్న చిన్న అజాగ్రత్తలతో చాలా మంది జబ్బుల బారిన పడుతున్నారు. దీనికి తోడు డబ్బు ఖర్చు చేస్తే ఎలాంటి వ్యాధి అయినా నయం చేయించుకోవచ్చనే ధీమా చాలామందిలో పెరిగిపోయింది. ఫలితంగా వ్యాధి ప్రారంభదశలో ఎవరూ వైద్యుల వద్దకు వెళ్లడం లేదు. జబ్బు ముదిరిపోయాక ఆస్పత్రులకెళ్లి రూ.లక్షలు ఖర్చు చేసుకుంటున్నారు.

వైద్యుల సూచన మేరకే వాడాలి



ఏ ట్యాబ్లెట్ అయినా వైద్యుడి సూచన మేరకే వాడాలి. ఏది పడితే అది మింగితే ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. చాలామంది కాలు బెణికినా, వళ్లు నొప్పులున్నా వెంటనే మెడికల్ స్టోర్‌కు వెళ్లి వైద్యుల సలహాతో పని లేకుండా పెయిన్‌కిల్లర్లు కొనుక్కొని వాడుతుంటారు. దీనివల్ల తాత్కాలిక ఉపశమనం లభించినా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఫలితంగా జబ్బుల బారిన పడతారు.

– ఎస్వీ కృష్ణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

టీడీపీ నేత పన్నాగం

- అంగన్‌వాడీ కార్యకర్త ఇంటర్వ్యూకు వెళ్లకుండా అడ్డగింత
- బంధువులతోనే గృహనిర్బంధం చేయించిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు

రామగిరి: టీడీపీ నేతల దుశ్చర్యలు ఆగడం లేదు. తాము చెప్పిందే జరగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. మహిళలపైనా రౌడీయిజం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకున్న ఓ మహిళలను ఇంటర్వ్యూకు వెళ్లకుండా ఓ టీడీపీ నేత పన్నాగం పన్నాడు. వివరాల్లోకి వెళితే...మండలంలోని గంగంపల్లి గ్రామానికి చెందిన హరిజన ముకుంద ఇటీవల అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తు చేసుకుంది. ఆమెకు మంగళవారం (10వ తేదీ) ధర్మవరంలో ఇంటర్వ్యూ ఉంది. ఈ మేరకు కాల్ లెటర్ కూడా అందింది. అయితే అదే పోస్టుకు టీడీపీ నేత, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామ్మూర్తి నాయుడు మద్దతుతో మరో ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రామ్మూర్తి నాయుడు తాను చెప్పిన వారికే ఉద్యోగం దక్కేలా ప్లాన్ చేశాడు. ఇంటర్వ్యూకు సిద్ధమైన హరిజన ముకుందను ఆమె బంధువులతోనే మంగళవారం ఉదయం గృహ నిర్బంధం చేయించాడు. దీంతో అన్ని అర్హతలున్న ఆమె ఉద్యోగం కోల్పోయింది. హరిజన ముకుంద వైఎస్సార్ సీపీకి మద్దతుదారురాలు కావడంతో రామ్మూర్తి నాయుడు ఆమెకు ఉద్యోగం దక్కకుండా చేశాడని సింగిల్ విండో అధ్యక్షుడు హెచ్‌ఎస్ ముత్యాలు, వైఎస్సార్ సీపీ నేతలు జేష్ఠ రామయ్య, బండారు అనిల్‌కుమార్, జె.ముత్యాలు, కుంటిమద్ది ఓబులేసులు తదితరులు తెలిపారు. అధికారులు స్పందించి అన్ని అర్హతలున్న ముకుందకు న్యాయం చేయాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

నేడు సామూహిక గృహ ప్రవేశాలు

పుట్టపర్తి అర్బన్: 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిరుపేదలకు స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మిస్తోంది. అందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా 15,931 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటికి సంబంధించి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారులకు స్వాధీనం చేయనున్నారు. గురువారం ఉదయం జిల్లా వ్యాప్తంగా సామూహిక గృహ ప్రవేశాల పండుగ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. జిల్లాస్థాయి గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని గోరంట్ల మండలం మల్లాపల్లి జగనన్న లేవుట్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు హాజరు అవుతున్నట్లు చెప్పారు.

'సురక్ష'.. ప్రజల ఆరోగ్యానికి రక్ష

ధర్మవరం రూరల్: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి రక్షగా మారిందని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. బుధవారం ఆయన డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డితో కలిసి మండల పరిధిలోని ఏలుకుంట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్లను పరిశీలించారు. అందుతున్న వైద్య సేవల గురించి ప్రజలను ఆరా తీశారు. వైద్యులు పుష్పలత, దిలీప్‌కుమార్, వినోద్‌కుమార్, పాల్ జీవీఎస్ తదితరులతో మాట్లాడి శిబిరానికి ఎక్కువగా ఎలాంటి రోగులు వస్తున్నారని ఆరా తీశారు. దీర్ఘకాలిక రోగులు ఎవరైనా వచ్చారా...., రెఫర్‌కు వెళ్లే కేసులు ఏవైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తోందన్నారు. దీనివల్ల ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకోవడం సులభతరమైందన్నారు. జబ్బు ముదిరాక వైద్యం చేసేకంటే ముందస్తు పరీక్షలతో గుర్తించడం వల్ల రోగులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ప్రజలు సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జగనన్న సురక్ష వైద్య శిబిరం ద్వారా 249 మందికి వైద్యసేవలతో పాటు ఉచితంగా మందులను అందించినట్లు డాక్టర్ పుష్ప తెలిపారు. అదే విధంగా 70 మందికి కంటి పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్డీఓ తిప్పేనాయక్, మెడికల్ స్పెషల్ ఆఫీసర్ చాంద్‌బాషా, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్, సీహెచ్‌ఓ కళావతి, ఈఓఆర్డీ మమతాదేవి, సీనియర్ అసిస్టెంట్ శంకర్‌రెడ్డి, ఏఎస్‌ఎంలు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సేవల గురించి డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డిని ఆరా తీస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అంగన్‌వాడీ.. ఉద్యోగాల సవ్వడి

- ఖాళీల భర్తీకి ఎప్పటికప్పుడు చర్యలు
- నూతన జిల్లాలో 236 మందికి ఉద్యోగాలు, 43 మందికి పదోన్నతులు
- మెరుగైన సేవలందిస్తున్న అంగన్‌వాడీలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న బాలింతలు, గర్భిణులు, చిన్నారులు



పాఠాలు చెబుతున్న అంగన్‌వాడీ కార్యకర్త (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ప్రీస్కూల్‌తో చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందించడానికి ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు ఆనందాలకు నిలయంగా మారాయి. ఖాళీలన్నీ ఎప్పటికప్పుడు గుర్తిస్తూ భర్తీ చేస్తుండగా ఎందరికో ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయి. అలాగే అంగన్‌వాడీ పరిధిలోని లబ్ధిదారులకు మెరుగైన సేవలందుతున్నాయి.

ఖాళీ ఏర్పడితే భర్తీ..

జిల్లాలో మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 2,824 ఉండగా.. వాటి పరిధిలో 24,815 మంది గర్భిణులు, బాలింతలు, 94,838 మంది చిన్నారులు సేవలు పొందుతున్నారు. ఈ కేంద్రాల ద్వారా పౌష్టికాహార పంపిణీ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ వంటి పథకాల కింద పాలు, గుడ్లు, ఫోర్టిఫైడ్ బియ్యం, చిక్కీలు, అటుకులు, రాగి పిండి, జొన్నపిండి వంటి ఎన్నో పోషకాలున్న ఆహారాన్ని అందిస్తున్నారు. అలాగే చిన్నారులకు పోషకాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్య, ప్రీస్కూల్ విద్యను అందిస్తున్నారు. ఎక్కడైనా అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాల కొరత ఏర్పడితే ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగాలను భర్తీ చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఈ క్రమంలోనే శ్రీసత్యసాయి జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి దాకా నాలుగు సార్లు నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగాలను భర్తీ చేసింది.

236 ఉద్యోగాలు, 43 మందికి పదోన్నతులు..

జిల్లా ఏర్పడిన తర్వాత ఐసీడీఎస్ బలోపేతానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేశారు. ఈ క్రమంలోనే ఏడాదిన్నర కాలంలోనే 236 మందికి కార్యకర్త, మినీ కార్యకర్త, ఆయా ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి ఎంపిక చేశారు. అలాగే 10 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన 10 మంది కార్యకర్తలకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి గ్రేడ్–1 సూపర్ వైజర్లుగా పదోన్నతులు కల్పించారు. ఇక 33 మంది ఆయాలకు కార్యకర్తలుగా పదోన్నతి కల్పించారు. తాజాగా అక్టోబర్ 10వ తేదీన 65 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఏడాదిన్నరలో 34 మందికి కార్యకర్తలుగా, 37 మందికి మినీ కార్యకర్తలుగా, 165 మందికి ఆయాలుగా అవకాశాలు కల్పించారు. దీంతో వందలాది కుటుంబాల్లో సంతోషాలను నింపారు.

సంతోషంగా ఉంది



నేను చాలాకాలం కొత్తచెరువులో అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వర్తించా. ఇటీవలే ప్రభుత్వం రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి సూపర్‌వైజర్‌గా పదోన్నతి కల్పించింది. ఎవరి సిఫారసు లేకుండా, ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా పదోన్నతి దక్కింది.

– శ్రీదేవి, గ్రేడ్–1 సూపర్‌వైజర్, ధర్మవరం

పారదర్శకతతో పోస్టుల భర్తీ



అంగన్‌వాడీ ఖాళీలు గుర్తించిన వెంటనే నోటిఫికేషన్ విడుదల చేస్తున్నాం. పోస్టుల భర్తీలోనూ పూర్తి పారదర్శకత పాటిస్తున్నాం. 18 నెలల కాలంలోనే నాలుగు నోటిఫికేషన్లు ఇచ్చి ఖాళీలన్నీ భర్తీ చేశాం. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీల ద్వారా మెరుగైన సేవలందిస్తున్నాం.

– లక్ష్మీకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్

టాప్‌లేపితే సెల్ఫీ

సర్కారు బడుల్లోని విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మరో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'సెల్ఫీ విత్ టాపర్' పేరుతో పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు గురువులతో సెల్ఫీ ఇప్పిస్తోంది. విద్యార్థుల్లో పోటీతత్వం పెంచి మరింత మెరుగ్గా రాణించేందుకు అవకాశం ఉంటుందని విద్యావేత్తలు భావిస్తున్నారు.

- సర్కారు స్కూళ్ల విద్యార్థులకు ప్రోత్సాహం
- 'సెల్ఫీ విత్ టాపర్' కార్యక్రమానికి శ్రీకారం
- ఎఫ్‌ఏ–2 పరీక్షల నుంచి అమలుకు చర్యలు
- ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయుల సెల్ఫీ

ప్రశాంతి నిలయం: గురువంటే ఎవరికైనా ఆదర్శమే. అలాంటి గురువే విద్యార్థితో సెల్ఫీ తీసుకుని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే ఆ విద్యార్థి ఆనందం మాటల్లో చెప్పలేనిది. ఇలాంటి అవకాశం కోసం ఏ విద్యార్థి అయినా ఎంతైనా శ్రమిస్తాడు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం 'సెల్ఫీ విత్ టాపర్స్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లో ఏడాది పొడవునా నిర్వహించే పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులతో జిల్లా స్థాయి అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు సెల్ఫీలు దిగి వాటిని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తూ విద్యార్థులను ప్రోత్సహించనున్నారు. ఎఫ్‌ఏ-2(ఫార్మేటివ్ అసెస్‌మెంట్) పరీక్షల నుంచి 'సెల్ఫీ విత్ టాపర్స్' అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాలు జారీ చేశారు.



పోటీతత్వం పెంచేందుకు...

జిల్లాలో 1,553 ప్రాథమిక, 229 ప్రాథమికోన్నత, 315 ఉన్నత పాఠశాలలు వివిధ యాజమాన్యాల కింద నడుస్తున్నాయి. ఆయా పాఠశాలలన్నింటిలో 2,60,707 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమం ద్వారా వీరందరినీ ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమం ద్వారా మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు సెల్ఫీలు దిగి సామాజిక మాధ్యమాల్లో వారి ప్రతిభ గురించి ప్రచారం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో మిగిలిన విద్యార్థులు సైతం చైతన్యవంతులై తాము కూడా మంచి మార్కులు సాధించి సెల్ఫీ దిగాలన్న పట్టుదలను పెంచుకుంటారని, తద్వారా పోటీతత్వం పెరిగి మెరుగైన ఫలితాలు సాధించవచ్చని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

ఎఫ్‌ఏ–2 పరీక్షల నుంచి అమలు..

ఎఫ్‌ఏ-2 పరీక్షల తర్వాత జిల్లావ్యాప్తంగా 'సెల్ఫీ విత్ టాపర్స్' కార్యక్రమాన్ని అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకూ మూడు రోజులు పాటు ఎఫ్‌ఏ–2 పరీక్షలు జరిగాయి. మూల్యాంకనం పూర్తయిన వెంటనే విద్యార్థుల మార్కులను వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. మార్కుల ఆధారంగా మెరిట్ జాబితాను రూపొందించి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో టాపర్స్ లిస్ట్ తయారు చేస్తారు. ఆ వెంటనే 'సెల్ఫీ విత్ టాపర్స్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఆదేశాలు అందాయి.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే



ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులే సెల్ఫీలు దిగి సామాజికి మాధ్యమాల్లో ప్రచారం చేస్తారు.

– మీనాక్షి, జిల్లా విద్యాశాఖ అధికారిణి

పోటీతత్వం పెరుగుతుంది



'సెల్ఫీ విత్ టాపర్స్' ద్వారా విద్యార్థుల్లోనూ పోటీతత్వం పెరుగుతుంది. రానున్న రోజుల్లో జిల్లా, డివిజన్ స్థాయి అధికారులను సైతం భాగస్వాములను చేస్తాం.

– మహేంద్ర రెడ్డి, సమగ్రశిక్ష, అసిస్టెంట్ ఏఎంఓ

'అనంత' బోధనాస్పత్రికి మహర్దశ

- రూ.6.9 కోట్ల నిధుల మంజూరు
- సర్వజనాస్పత్రి, వైద్య కళాశాలలో 13 పనులు



అనంతపురం మెడికల్: అనంతపురం బోధనాస్పత్రి (సర్వజనాస్పత్రి – ప్రభుత్వ వైద్య కళాశాల)కి మహర్దశ పట్టనుంది. వైఎస్సార్‌సీపీ పాలనలో బోధనాస్పత్రిలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచి నాణ్యమైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టింది. బోధనాస్పత్రికి ప్రభుత్వం రూ.6.9 కోట్ల నిధులు కేటాయించింది. అందులో వైద్య కళాశాలలో 8 అభివృద్ధి పనులకు రూ.3.4 కోట్లు, సర్వజనాస్పత్రిలో 5 పనులకు రూ.3.5 కోట్లు కేటాయించింది. ఆస్పత్రిలోని ఓల్డ్ బ్లాక్‌లో ఉన్న గైనకాలజీ, రేడియాలజీ విభాగాల్లో మరమ్మతు పనులకు రూ.కోటి, అదే బ్లాక్‌లో రెండో ఫ్లోర్‌లో సర్జికల్ విభాగానికి రూ.65 లక్షలు, ఆర్థో బ్లాక్‌లోని ఆర్థో, జనరల్ మెడిసిన్ విభాగానికి రూ.1.05 కోట్లు, క్యాజువాలిటీ, ఏఎంసీకి రూ.57 లక్షలు, మార్చురీకి రూ.23 లక్షలు కేటాయించారు. వైద్య కళాశాలలో అనాటమీ, ఫోరెన్సిక్, ప్రిన్సిపాల్ కార్యాలయానికి రూ.40 లక్షలు, పెథాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ విభాగానికి రూ.24 లక్షలు, వైద్య కళాశాల టెర్రాస్ ఫ్లోర్, బిల్డింగ్ బయట భాగానికి రూ.35 లక్షలు, ఆడిటోరియానికి రూ.29 లక్షలు, యూజీ గర్ల్స్ హాస్టల్‌కు రూ.42 లక్షలు, యూజీ బాయ్స్ హాస్టల్‌కు రూ.46 లక్షలు, మెడికల్ కాలేజ్ స్టాఫ్ క్వార్టర్స్‌కు రూ.84 లక్షలు కేటాయించారు. ఈ పనులు సకాలంలో పూర్తయితే రోగులకు నాణ్యమైన సేవలందే అవకాశం లేకపోలేదు. ముఖ్యంగా ఆపరేషన్ థియేటర్, ఏఎంసీ, ఐసీసీయూ విభాగాల్లో ఏసీల మరమ్మతులు జరగనున్నాయి. సీసీ కెమెరాల నిర్వహణతో నిఘా మరింత పటిష్టం కానుంది.

పనుల పూర్తికి చర్యలు

బోధనాస్పత్రిలో 13 అభివృద్ధి పనులకు సంబంధించి 8 పనులకు టెండర్ల నిర్వహణ పూర్తయ్యింది. త్వరలో మిగతా వాటికి టెండర్లు పూర్తవుతాయి. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– మహబూబ్, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ

క్లుప్తంగా

ఫెన్సింగ్ జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

అనంతపురం: తూర్పుగోదావరి జిల్లా వేదికగా ఈ నెల 14 నుంచి జరిగే 10వ రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ బుధవారం ముగిసింది. మొత్తం 80 మంది క్రీడాకారులు హాజరు కాగా, వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన 42 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్ 23 ఫాయిల్ విభాగంలో ఎం.రాహుల్, ఎ.మనోజ్, డి.విజయ్‌కుమార్, ప్రణీత్, పి.సమీరారెడ్డి, యశస్విణి, ఎస్.నాగవర్షిత, జి.చందన ఎంపిక కాగా, ఇప్పి విభాగంలో ఎస్. ముషైన్, ఎ.ఆంజనేయ సూర్య, పి.హరివేంద్ర, ఎస్.నూర్ మహమ్మద్, జి.సిరి, కె.వర్షిత, ఎస్.అలియ, టి.శరణి... సాబర్ విభాగంలో డి.సుప్రాత్ సింహ, ఎస్.ఇనాయతుల్లా, మోహిత్, పురంజమ్, ఎం.నిఖిత, పి.సిరి, ఎం.గాయత్రి చోటు దక్కించుకున్నారు. అలాగే సీనియర్స్ ఫాయిల్ విభాగంలో రోమన్, త్రివేణి, జెన్సర్,నిఖిత, ప్రబంధ, ఇప్పి విభాగంలో రాహుల్, సమీర్, కృష్ణ, బి.బాసతి, సాబర్ విభాగంలో రామకృష్ణ, రవికుమార్, కుషాల్, సిరి, పి.షబాఖానమ్, సాదియా ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ సెక్రెటరీ ఎ.మురళీకృష్ణ, ఖేలో ఇండియా కోచ్ కె.లక్ష్మీదేవి, కె.కృష్ణ, డి.సమీర్ తదితరులు పాల్గొన్నారు.

పడిలేస్తున్న పసిడి

- 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై పెరిగిన రూ.650
- ఐదు రోజుల వ్యవధిలోనే స్పష్టమైన మార్పు

హిందూపురం అర్బన్: అంతర్జాతీయ పరిస్థితులు, స్థానికంగా కొనుగోళ్లు తగ్గడం తదితర కారణాలతో నెల రోజులుగా దిగివచ్చిన బంగారం ధరలు.. ప్రస్తుతం మళ్లీ పుంజుకుంటున్నాయి. ఇజ్రాయెల్ - పాలస్తీనా యుద్ధంతో మళ్లీ బంగారం ధరలకు రెక్కలు వస్తున్నట్లుగా వ్యాపారులు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే గత ఐదు రోజులుగా బంగారం ధర పెరుగుతూ వస్తోంది. ఈ నెల 5న 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.53 వేలు ఉండగా బుధవారం నాటికి రూ.650 పెరిగి రూ.53,650కు చేరుకుంది. అలాగే 24 క్యారెట్ల బంగారం ధర సైతం రూ.530 పెరిగి రూ.58,530కు చేరుకుంది. అనంతపురం, హిందూపురం, కదిరి మార్కెట్లలో 22 క్యారెట్ల గ్రాము బంగారం రూ.5,400 నుంచి రూ.5,500 ధర పలుకుతోంది. అలాగే 24 క్యారెట్ల గ్రాము బంగారం రూ.5,900 నుంచి రూ.5950 వరకు విక్రయాలు సాగిస్తున్నారు. వెండి సైతం గత వారం కిలో రూ.72వేలు ఉండగా బుధవారం రూ.75,500కు చేరుకుంది.

ఉమ్మడి జిల్లాలో రోజూ రూ.5కోట్ల వ్యాపారం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజూ రూ.5 కోట్లకు పైగా బంగారం విక్రయాలు సాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రధానంగా అనంతపురం, తాడిపత్రి, హిందూపురం, కదిరి, ధర్మవరం ప్రాంతాల్లో బంగారం దుకాణాలు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. ఆన్‌సీజన్‌లోనే రూ.5 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు సాగితే.. సీజన్‌లో ఇది రెట్టింపు అయ్యే అవకాశముంటుందని వర్తకులు అంటున్నారు.

బెంగళూరు మార్కెట్‌లో ధరలు ఇలా..				
క్యారెట్లు	గ్రాములు	గత నెల 27న ధర	ఈ నెల 5న ధర	10వ తేదీ ధర
24	10	రూ.60,215	రూ.58 వేలు	రూ.58,530
22	10	రూ.55,630 (ఆర్నమెంట్)	రూ.53 వేలు	రూ.53,650



యుద్ధంతోనే మళ్లీ ధరలు పైపైకి



గత నెలలో అమెరికాలో ఆర్థిక సంక్షోభం కారణంగా బంగారం ధరలు తగ్గు ముఖం పట్టాయి. తర్వాత ఇజ్రాయిల్–పాలస్తీనా యుద్ధంతో ఐదు రోజులుగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. బుధవారం 24 క్యారెట్ల గ్రాము బంగారంపై రూ. 200 నుంచి రూ.220 వరకు పెరుగుదల కనిపించింది. ఇది మరింత పెరిగే అవకాశముంది.

– నంబూరి శంకర్, ఏపీ బులియన్ మార్కెట్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, హిందూపురం

సీఆర్పీకి ప్రధాని అభినందన


పీఎం కార్యాలయం నుంచి వచ్చిన లేఖను అందుకుంటున్న సీఆర్పీ వెంకటరమణ

బత్తలపల్లి: మండలంలోని అప్పరాచెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న క్లస్టర్ రీసోర్స్ పర్సన్ (సీఆర్పీ) వెంకటరమణను అభినందిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ లేఖ పంపారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి పోస్టల్ ద్వారా అందిన అభినందన లేఖను బుధవారం పాఠశాలలో మండల విద్యాధికారులు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. పరీక్షల విధానపరమైన అంశాలపై అధ్యయనం చేసేందుకు దేశ వ్యాప్తంగా నిర్వహించిన 'పరీక్ష పే చర్చ' కార్యక్రమానికి సరైన సూచనలు చేసినందుకు గాను ఆయనను అభినందిస్తూ ప్రధాని లేఖ పంపారు. ఈ సందర్భంగా వెంకటరమణను ప్రధానోపాధ్యాయురాలు ప్రమోద, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది అభినందించారు.

బాలికల రక్షణ అందరి బాధ్యత

- ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి


ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, తదితరులు

బత్తలపల్లి: సమాజంలో బాలికల రక్షణను అందరూ బాధ్యతగా స్వీకరించాలని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి పిలుపునిచ్చారు. బత్తలపల్లి మండలం సంజీవపురంలోని కేజీబీవీలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ గుల్జార్ బేగం అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీకుమారి మాట్లాడుతూ.. అవకాశమిస్తే ప్రతి రంగంలోనూ బాలికలు రాణిస్తారన్నారు. బాలిక విద్యకు ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయన్నారు. చైల్డ్ హెల్ప్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ కృష్ణమాచార్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలను అరికట్టేందుకు సహకరించాలని కోరారు. సీడీపీఓ సరస్వతి మాట్లాడుతూ... బాల్యవివాహాలు, బాలల హక్కులకు ఉల్లంఘన ఎక్కడ జరిగిన చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు కాల్ చేసి తెలిపితే వెంటనే రక్షణ కల్పిస్తామన్నారు. అంతకు ముందు బాలల చట్టాలు, బాల్యవివాహాలు, భ్రూణహత్యలు, బాలిక విద్య, లైంగిక వేధింపులు వంటి అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని పోస్టర్లను విడుదల చేశారు. ఎంపీడీఓ సాయిమనోహర్, డీసీపీయూ సోషల్ వర్కర్ నాగలక్ష్మి, హెల్ప్‌లైన్ సిబ్బంది ఇర్ఫాన్, నిర్మల, సచివాలయ సిబ్బంది, జీఎంఎస్‌కే శోభ, ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

మరదలిపై కత్తితో దాడి

- అన్నం తింటుండగా బావ అఘాయిత్యం


చికిత్స పొందుతున్న మారుతమ్మ

కళ్యాణదుర్గం: ఆస్తి విషయంగా కక్ష పెంచుకున్న బావ... ఏకంగా మరదలిపై హత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కూడేరు మండలం పి.నాగిరెడ్డిపల్లికి చెందిన హరిజన మారుతమ్మ కళ్యాణదుర్గం పట్టణ పరిధిలోని శంకరప్ప తోట కాలనీలో నివాసముంటూ స్థానిక ఆర్డీటీ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ఆరేళ్ల క్రితం బ్రహ్మసముద్రం మండలం సంతేకొండాపురం నివాసి మేడా రాధాకృష్ణతో ప్రేమ వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో రాధాకృష్ణ మృతిచెందాడు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగానే జీవిస్తోంది. ఈ క్రమంలో సంతే కొండాపురంలో తన భర్తకు చెందిన ఆస్తిని కోర్టుకెళ్లి దక్కించుకుంది. ఇందులో ఇటీవల రెండు సెంట్ల స్థలాన్ని విక్రయించేందుకు ఆమె సిద్ధం కావడంతో రాధాకృష్ణ సోదరుడు మేడా వెంకటేశులు అభ్యంతరం లేవనెత్తాడు. అయినా ఆమె వినకపోవడంతో కక్ష పెంచుకున్న ఆయన బుధవారం మధ్యాహ్నం ఇంట్లో భోజనం చేస్తున్న మారుతమ్మపై మచ్చుకత్తితో దాడి చేశాడు. ఆ సమయంలో ఆమె గట్టిగా కేకలు వేయడంతో వెంకటేశులు అక్కడి నుంచి పారిపోయాడు. మారుతమ్మ తలకు, భుజానికి బలమైన గాయలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై కళ్యాణదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలను చూపుతున్న పోలీసులు

తాడిమర్రి: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను తాడిమర్రి పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ నాగస్వామి వెల్లడించారు. విధుల నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం 11 గంటలకు పుల్లంపల్లి వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో తాడిపత్రి వైపు నుంచి నార్సింపల్లి మీదుగా ధర్మవరం వైపు వెళుతున్న ఏపీ 16 టీఎఫ్ 1994 వాహనాన్ని ఆపి పరిశీలించగా 70 బస్తాల్లో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. వాహనాన్ని సీజ్ చేసి, బియ్యం తరలిస్తున్న తాడిపత్రి మండలం గన్నెవారిపల్లికి చెందిన మేడిసారి సముద్రుడుని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తాడిపత్రి మండలంలోని పలు గ్రామాల్లో ప్రజల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి, కర్ణాటక ప్రాంతానికి తరలించి అధిక ధరకు విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నట్లు అంగీకరించాడు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సీఎస్‌డీటీ శారదకు అప్పగించి, నిందితుడిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి


విజయమ్మ (ఫైల్)

కదిరి అర్బన్: పాముకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వివాహిత ఆరోగ్యం విషమించి మృతి చెందింది. వివరాలు.. కదిరి మండలం చిప్పలమడుగు గ్రామానికి చెందిన వివాహిత విజయమ్మ (38) గత నెల 30న తమ సొంత పొలంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నప్పుడు పాము కాటుకు గురైంది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే కదిరిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక బుధవారం ఉదయం ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి... బుధవారం చిప్పలమడుగు గ్రామానికి చేరుకుని విజయమ్మ మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనపై ఆరా తీసి, బాధితులను ఓదార్చారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి..


మృతిచెందిన రామాంజనేయులు

నల్లమాడ: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. నల్లమాడ మండలం నల్లసింగయ్యగారిపల్లి దళిత వాడకు చెందిన సి.రామాంజనేయులు (36), లీలావతి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కార్పెంటర్ పనితో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 8 గంటలకు నల్లమాడలో పనిముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో సింగినేయకుంట సమీపంలోకి చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కనే ఉన్న బండరాళ్లను ఢీకొన్నాడు. ఘటనలో తల, ముఖం, ఛాతీపై బలమైన గాయాలు కావడంతో రామాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై ఎస్‌ఐ వలీబాషా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఈ-కేవైసీ నమోదు పూర్తి చేయండి

- డీఏఓ సుబ్బారావు


ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు

రొళ్ల: ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాల ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందిని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) సుబ్బారావు ఆదేశించారు. బుధవారం సాయంత్రం రొళ్ల మండలం బీజీ హళ్లి, కాకి, ఎం.రాయాపురం, దొడ్డేరితో పాటు అగళి మండలంలోని వివిధ గ్రామాల భరోసా కేంద్రాల పరిధిలో చేపట్టిన ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి తర్వాత రైతులతో తప్పని సరిగా ఈ-కేవైసీ చేయించాలన్నారు. గడువు సమీపిస్తుండంతో ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు వేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మడకశిర ఏడీఏ కృష్ణమీనన్, ఏఓ రాజ్యలక్ష్మి, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన రైల్వే పోలీసులు


మహిళను భర్తకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

ధర్మవరం: కుటుంబ సమస్యలతో విసుగు చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోబోతున్న మహిళను ధర్మవరం రైల్వే పోలీసులు కాపాడారు. ధర్మవరం పట్టణంలోని యాదవవీధికి చెందిన వెంకటేశ్వరప్రసాద్ భార్య సుజాత కుటుంబ సమస్యలతో బుధవారం ఉదయం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని వెళుతున్న ఆమెను గమనించిన రైల్వే పోలీసులు తక్షణమే స్పందించి కాపాడారు. తన భర్త వ్యసనాలకు బానిసై అధిక వడ్డీలకు అప్పులు చేశాడని, తన భర్తలో మార్పు రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చినట్లు బాధితురాలు వాపోయింది. దీంతో వెంకటేశ్వరప్రసాద్‌ను రప్పించుకుని కౌన్సెలింగ్ ఇచ్చి భార్యను అప్పగించారు. కాగా, సుజాత ప్రస్తుతం 5 నెలల గర్భిణిగా తెలిసింది. కార్యక్రమంలో రైల్వే ఎస్‌ఐ గోపీకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం


మృతురాలు సుజాత

ధర్మవరం అర్బన్: కుటుంబ కలహాల నేపథ్యంలో విసుగు చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన నారాయణస్వామి, సుజాత (38) దంపతులు. వీరికి ఓ కుమార్తె ఉంది. మగ్గం పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఇటీవల నారాయణస్వామి మద్యానికి బానిసై మగ్గం నేయకుండా జులాయిగా మారాడు. దీంతో దంపతుల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకునేవి. కుటుంబ పోషణ భారమైంది. ఈ క్రమంలోనే అప్పులూ పెరిగిపోయాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుజాత బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

బిందు సేద్యంపై అవగాహన పెంచుకోవాలి

- ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్


డ్రిప్ పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సుదర్శన్

గోరంట్ల: బిందు, తుంపర సేద్యంపై అవగాహన పెంచుకుంటే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని రైతులకు ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ సూచించారు. గోరంట్ల మండలం వానవోలు పంచాయతీ ఉగ్గరారంపల్లి రైతులకు ఇటీవల సబ్సిడీ ధరపై ప్రభుత్వం బిందు సేద్యం పరికరాలను అందజేసింది. వీటిని బుధవారం ఆయన పరిశీలించారు. డ్రిప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రిప్ సౌకర్యం కోరుకునే రైతులు స్థానిక సచివాలయాల ద్వారా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఐఏఓ చెన్నకేశవులు, కంపెనీ ప్రతినిధి సుధాకర్, రామాంజనేయులు, భరత్‌కుమార్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం

- వెనుక నుంచి బలంగా హారన్ మోగించిన వాహన డ్రైవర్
- ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగిన లారీని ఢీకొన్న వైనం
- మృతుడు విద్యుత్ శాఖ ఉద్యోగి


ఘటనాస్థలంలో పడి ఉన్న మృతదేహం, (ఇన్‌సెట్) వసంత్‌కుమార్ (ఫైల్)

పెద్దవడుగూరు: రోడ్డు పక్కన నిలబడిన లారీని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహన చోదకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు...

గుత్తి ఆర్ఎస్‌కు చెందిన వసంతకుమార్ అలియాస్ ప్రేమ్ (49) గార్లదిన్నె మండలం కల్లూరులో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. భార్య దేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రోజూ విధులకు గుత్తి ఆర్ఎస్ నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్లి వచ్చేవాడు. ఈ నేపథ్యంలోనే బుధవారం ఉదయం డ్యూటీ ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరిన ఆయన పెద్దవడుగూరు మండలం మిడుతూరు వద్ద 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహన డ్రైవర్ వెనుక నుంచి గట్టిగా హారన్ మోగించడంతో ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాడు. అదే సమయంలో అప్రయత్నంగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి అప్పటికే రోడ్డుకు ఎడమ వైపు నిలబడిన కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో వసంతకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

బ్యాంక్ ఖాతాలో నగదు మాయం

తలుపుల: ఖాతాదారుకు తెలియకుండా బ్యాంక్ ఖాతా నుంచి రూ.2.49 లక్షలు అపహరించిన ఘటన తలుపులలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... స్థానిక ఓబీఆర్ రోడ్డులో నివాసముంటున్న మస్తాన్‌బీ... బతుకు తెరువు కోసం కువైట్‌కు వలస వెళ్లింది. తలుపులలోని యూనియన్ బ్యాంక్ శాఖలో ఉన్న తన ఖాతాకు ఈ ఏడాది ఆగస్టులో రూ.లక్ష నగదు జమ చేసింది. అంతకు ముందు విడతల వారీగా రూ.2.49 లక్షల వరకూ జమ చేసింది. అయితే కేవలం ఆగస్టులో పంపిన రూ.లక్ష మాత్రమే బ్యాంకు ఖాతాలో ఉంది. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన మస్తాన్‌బీ కుమారుడు అహమ్మద్ నేరుగా బ్యాంక్ అధికారులను కలసి ఆరా తీశాడు. సైబర్ నేరగాళ్ల పనిగా గుర్తించిన అధికారుల సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసిన ఎస్‌ఐ మగ్బూల్‌బాషా.. బ్యాంకర్ల నుంచి వివరాలు రాబట్టుకున్నారు. ఈ ఏడాది మార్చి నుంచి ఆగస్టు వరకూ బిహార్‌లో వేలి ముద్రల ఆధారంగా గుర్తు తెలియని వ్యక్తులు విడతల వారీగా నగదు డ్రా చేసినట్లు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా సెబ్ తనిఖీలు

పుట్టపర్తి టౌన్: సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ధర్మవరం సెబ్ పరిధిలో 4 కేసులు నమోదు చేసి 3 డీసీఎల్, ఎన్డీపీఎల్ 87 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పెనుకొండ సెబ్ పరిధిలో 1 డీపీఎల్, ఎన్డీపీఎల్ 33 బాటిళ్లు స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి ఓ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. హిందూపురం సెబ్ పరిధిలో 62 డిప్స్, 12 నిప్స్ స్వాధీనం చేసుకుని రెండు ద్విచక్ర వాహనాలు సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అలాగే మడకశిర సెబ్ పరిధిలో అక్రమంగా మూడు ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుకను స్వాధీనం చేసుకుని, ట్రాక్టర్లను సీజ్ చేశారు.

కాస్మిక్ కిరణాలను గుర్తించే పరికరం ఆవిష్కరణ

- జేఎన్‌టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శైలకుమారి, రాఘవేంద్ర వినూత్న పరిశోధన


ప్రాజెక్ట్ వివరాలు తెలుసుకుంటున్న జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: అత్యంత శక్తివంతమైన కాస్మిక్ కిరణాలను గుర్తించే పరికరాన్ని జేఎన్‌టీయూ (ఏ) మేథమేటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.శైలకుమారి, ఆర్.రాఘవేంద్ర ఆవిష్కరించారు. 'ఏ స్టడీ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ ఈక్వేష్ ఆఫ్ గాలాక్టిక్ కాస్మోటిక్ రేస్ ఇన్ ద అట్మాస్పియర్ – కాస్మిక్ ఎనర్జీ డిక్టేటర్' అనే ప్రాజెక్ట్‌పై వారు పరిశోధన చేసి, ఈ అద్భుతాన్ని ఆవిష్కరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను జేఎన్‌టీయూ పాలకభవనంలో బుధవారం ఆ వర్సిటీ వీసీ ఆచార్య జింకా రంగజనార్ధన, రెక్టార్ ఆచార్య ఎం.విజయకుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ఫిజిక్స్ విభాగాధిపతి ఆర్.పద్మ సువర్ణ సమక్షంలో వెల్లడించారు. కాస్మిక్ కిరణాలు ముఖ్యంగా ప్రోటాన్లు, భారీ ఆయాన్లు వంటి అధిక శక్తి కణాలు. ఇవి క్యాన్సర్ చికిత్స కోసం రేడియేషన్ థెరపీలో ఉపయోగించే కణాలకు సమానమైన లక్షణాలను కలిగి ఉంటాయి. ప్రోటాన్ థెరపీ, కార్బన్ అయాన్ థెరపీతో సహా పారికల్ థెరపీ క్యాన్సర్ చికిత్సలో భాగం. ఈ నేపథ్యంలో కాస్మిక్ కిరణాలకు అత్యంత ప్రాధాన్యత చేకూరింది. అంతేకాక మానవ శరీరంలో రక్తశుద్ధి చేసేందుకూ కాస్మిక్ కిరణాలు దోహదపడతాయి. ఈ పరికరాన్ని ఉపయోగించి పిరమిడ్‌లో అత్యధికంగా కాస్మిక్ కిరణాలు ఉన్నట్లు నిర్ధారణ చేశారు. మన చుట్టూ ఉండే పరిసరాల్లో ఎంత మేర కాస్మిక్ కిరణాలు ఉన్నాయి? అనే అంశాన్ని సైతం ఈ పరికరం ద్వారా కనుగొనవచ్చు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఓ పోర్టబుల్ మ్యూయాన్ డిటెక్టర్‌కు రూపకల్పన చేశారు. కాస్మిక్ కిరణాల గుర్తింపు, కచ్చితత్వాన్ని కొలిచేందుకు వీలుగా ఆర్డినో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌ను ఉపయోగించారు. ఉష్ణోగ్రత, తేమ, అక్షాంశం, రేఖాంశం, వాతావరణ పీడనంపై డేటాను సేకరించడానికి సెన్సార్లను ఏర్పాటు చేశారు. కాగా, ఈ పరిశోధనకు రూ.90 వేలను జేఎన్‌టీయూ (ఏ) వెచ్చించింది. రెండేళ్ల కాల పరిమితి గల ఈ పరిశోధన 15 నెలల్లోనే పూర్తి చేయడంపై శైలకుమారి, రాఘవేంద్రను వీసీ జింకా రంగజనార్దన అభినందించారు. ప్రాజెక్ట్‌ను కొనసాగిస్తూ ఆవిష్కరణను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు.